క్లుప్తంగా

'జాబ్‌మేళా' సద్వినియోగం చేసుకోండి



పోస్టర్లను విడుదల చేస్తున్న కాపు భారతి

రాయదుర్గం: నియోజకవర్గం లోని యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సతీమణి, రెడ్‌క్రాస్ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి అన్నారు. శుక్రవారం విప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, జెడ్పీటీసీ హొన్నే మల్లికార్జున, పార్టీ సీనియర్ నాయకుడు అరవ శివప్ప, కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, పక్రుద్దీన్, వన్నూర్‌స్వామి, డిష్ గోవిందు, పాలిటెక్నిక్ రాము, కేటీఎస్ డిగ్రీ కళాశాల లెక్చరర్లు కోదండరాము, విజయ్‌కుమార్‌తో కలసి ఆమె పోస్టర్లను విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 12న మంగళవారం ఉడేగోళం సమీపాన కేటీఎస్ డిగ్రీ కళాశాలలో స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తారన్నా కియా, ఎన్ఎస్ ఇన్‌స్టర్‌మెంట్స్ ఇండియా, మదర్‌సన్ సుమీసిస్టమ్స్ లిమిటెడ్, శ్రీరామ్‌లైఫ్ ఇన్సురెన్స్, నవభారత్ ఫర్టిలైజర్స్, కేగ్నెస్ ఈ సర్వీసెస్ లిమిటెడ్, విన్ధ్య ఇన్ఫోమీడియా లిమిటెడ్, సీట్స్‌సోలార్ ఎనర్జీ హోల్డింగ్స్ కో లిమిటెడ్, మ్యాన్‌ఫవర్ గ్రూప్ ఇండియా, ఫ్లిప్‌కాట్, జరీకార్ట్ తదితర కంపెనీలు హాజరువుతున్నట్టు వివరించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.18,500 నుంచి రూ. 25 వేల వరకు వేతనం అందజేస్తారన్నారు. నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి



బిల్లుల గురించి ఆరాతీస్తున్న ఎంపీడీఓ కొండయ్య

రాయదుర్గం రూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపీడీఓ కొండయ్య ఆదేశించారు. మండలంలోని జుంజురాంపల్లి సచివాలయాన్ని తనిఖీ చేసిన అనంతరం ఆయన జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్లు, లబ్ధిదారులకు అందిన బిల్లుల గురించి ఆరాతీశారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లిస్తోందని, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను ఆయన పరిశీలించారు. తదనంతరం వేపరాల గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి, సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ చిక్కణ్ణ, ఈసీ భారతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో 'శ్రావణ' శోభ



పూజలందుకున్న మహాలక్ష్మీ దేవి

రాయదుర్గం టౌన్: రాయదుర్గంలోని ప్రముఖ దేవాలయాల్లో చివరి శ్రావణ శుక్రవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పట్టణంలోని హటకేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేపట్టారు. స్వకుళసాళి సమాజ సత్రంలో రాజరాజేశ్వరి మహిళా మండలి ఆధ్వర్యంలో వరమహాలక్ష్మీ వ్రత పూజ నిర్వహించారు. అర్చకుడు కరణం రమేష్‌స్వామి వరలక్ష్మీ వ్రత పూజ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో మహిళా మండలి గౌరవాధ్యక్షులు సునంద, అధ్యక్షురాలు విమల, చంద్రకళ, శ్రీదేవి, భారతి పాల్గొన్నారు. పట్టణంలోని నేసేపేటలో వర మహాలక్ష్మీ ఆలయం, క్లోమఠం హైస్కూల్ వద్ద మహాలక్ష్మీ ఆలయం, మల్లాపురం ఇందిరమ్మ లేఅవుట్‌లో ఉన్న గజలక్ష్మీదేవి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. అలాగే వాసవీమాత ఆలయంలో, శాంతినగర్‌లోని బన్నిమహంకాళి ఆలయంలో, దుగ్గిలమ్మ ఆలయాల్లో, శ్రీబసవ నాగలింగేశ్వరస్వామి ఆలయాల్లో శ్రావణ శుక్రవారం విశేష పూజలు చేశారు.

నేమకల్లులో..



పుష్పాలంకరణలో నేమకల్లు ఆంజినేయస్వామి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రావణ మాసం బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి ప్రత్యేక పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

కంబదూరు: సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపు నిచ్చారు. శుక్రవారం అండేపల్లిలోని రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి వ్యవసాయ క్షేత్రంలో కంబదూరు పంచాయతీలోని వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో మంత్రి సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ సీఎం జగనన్న ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చి మాట నిలబెట్టుకున్నారన్నారు. మీరందరూ జగనన్న అమలు చేసిన పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి ప్రతిపక్షాల అసత్య ఆరోపణలను తిప్పికొట్టాలని సూచించారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా.. రాష్ట్రంలో 175 స్థానాలు సాధించడానికి గట్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప, పార్టీ మండల కన్వీనర్ బాలరాజు, వైస్ ఎంపీపీ బీమేష్, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కళ్యాణదుర్గం రూరల్: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శుక్రవారం కళ్యాణదుర్గం పట్టణంలోని వైఎస్సాసీపీ కార్యాలయంలో రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషాశ్రీ చరణ్ శుక్రవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ముగ్గురు లబ్ధిదారులకు రూ.3,50,000 లక్షల విలువ చేసే చెక్కులను ఆమె అందజేశారు.

నేడు బీటీ రోడ్డు ప్రారంభం

కళ్యాణదుర్గం: పట్టణంలోని ఐదుకల్లు రోడ్డులో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బ్రహ్మసముద్రం మండలానికి వెళ్లే నూతన రోడ్డుకు మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ భూమిపూజ చేయనున్నారు. ఈ మేరకు మంత్రి క్యాంపు కార్యాలయం శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఐదుకల్లు రోడ్డు నుంచి బ్రహ్మసముద్రం వరకూ సుమారు రూ.3.5 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డుకు మంత్రి భూమి పూజ చేస్తారు. కార్యక్రమానికి పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు.

'చంద్రబాబు' పని అయిపోయింది

- రూ.118 కోట్ల ముడుపుల వ్యవహారం లో అడ్డంగా దొరికాడు
- తప్పుచేశాడు కాబట్టే.. ఆయనకు అరెస్టు భయం పట్టుకుంది
- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



రాయదుర్గం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పని అయిపోందని, అతడు కోరుకున్నట్టే ఒకటి రెండు రోజుల్లో జైలుకెళ్లినా ఆశ్చర్యపోకతప్పదని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం 'సాక్షి' తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. అమరావతి లో రూ.600 కోట్లతో చేపట్టిన పనుల్లోనే కాంట్రాక్టర్ల నుంచి రూ.118 కోట్లు దండుకున్న దౌర్భాగ్యుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. ఈ వ్యవహారంలో ఆదాయపన్ను శాఖ అధికారులకు అడ్డంగా దొరికాడు కాబట్టే .. అరెస్టుల భయం పట్టుకుందన్నారు. ఈ విషయంలో టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు ప్రజలను తప్పుదారి పట్టించేలా వ్యవహరిస్తున్నాడని ధ్వజమెత్తారు. ఏదో సాధించినట్టు తమపై చాలెంజీలు చేయడం మాని, ముందు నీ అధినేత చంద్రబాబు అవినీతి భాగోతంపై చర్చిద్దామన్నారు. బాబు మెడకు చుట్టుకున్న ఈ ముడుపుల వ్యవహారంలోనైనా జైలుకెళుతారా..? లేక మునుపటి కేసుల్లాగా కోర్టు స్టే తెచ్చుకుంటాడా..? దీనిపై కాలవ శ్రీనివాసులే సమాధానం చెప్పాలన్నారు. ఈ గండం గట్టెంక్కేందుకు ఎవరికాళ్లు పట్టుకుంటాడో..? ఎవరి బూట్లు నాకుతాడో..? ఆలోచించాలన్నారు. చంద్రబాబుకు జైలు జీవితం తప్పదన్నారు. తప్పునాయుడు (చంద్రబాబు), పప్పునాయుడు (లోకేష్) భారీ స్కాముల్లో ఇరుకుంటున్నారని, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు అచ్చెంనాయుడు అన్నట్టు పార్టీ లేదు.. బొక్కలేదు గా మారడం ఖచ్చితమన్నారు. దేశంలోనే చంద్రబాబు లాంటి 420 మరొకరు ఉండరన్నారు. కోర్టు స్టేలను అడ్డుపెట్టుకుని జీవితాంతం గడిపేశాడన్నారు. చంద్రబాబు నిజమైన మనిషి పుట్టుక పుట్టి ఉంటే, మగతనమే ఉంటే..? స్టేలు వెకైట్ చేయించుకుని విచారణకు సిద్ధపడాలని సవాల్ చేశారు. అప్పుడు బాబు సత్తా ఏంటో తెలుస్తుందన్నారు. కాలవ దగుల్బాజీ నాయకత్వం పై ప్రజలకే కాదు పచ్చ పార్టీ నాయకులకే నమ్మకం లేదన్నారు. 2019 ఎన్నికల్లో ప్రజలు నీకు సరైన దారి చూపారని, 2024 ఎన్నికల్లో గోదారి చూపిస్తారన్నారు. రాష్ట్రంలో టీడీపీ శఖం ఎప్పుడో ముగిసిందని, బాబును హైదరాబాద్ కు, కాలవ ను అనంతపురానికి శ్యాశ్వతంగా పంపే రోజులు కూడా దగ్గరపడ్డాయన్నారు. 175 నియోజకవర్గాల్లోనూ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేసేందుకు ప్రజలంతా కంకణబద్ధులై నిలిచారన్నారు. మరో 30 ఏళ్లు సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ని మాత్రమే ప్రజలు కోరుకుంటారన్నారు.

సీఎం జగన్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

బెళుగుప్ప: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని జీడిపల్లిలో శుక్రవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు శ్రీనివాసరెడ్డి, రామన్న, ధనుంజయ, గాలి బ్రహ్మయ్య, గంగాధర, హనుమంతు, అక్కులన్న, షణ్ముఖ, వీరాంజనేయులు తదితరులు దుశ్శాలువాలు, గజమాలలు, పూలమాలలతో మాజీ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. తొలుత గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, వైకేపీ మహిళా సంఘాల సభ్యులు కలసి సంక్షేమ పథకాల సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందించారు. సమస్యలు అడిగి తెలుసుకుంటూ పరిష్కారం చూపుతూ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఊటనీటి బాధల విముక్తికి ఆర్‌అండ్‌ఆర్ పథకం అమలుకు సీఎం దృష్టికి తీసుకెళ్లామని, ఆర్థికశాఖ వద్ద మంజూరు కాగానే గ్రామంలో యూనిట్‌కు రూ.10 లక్షల చొప్పున అందజేస్తామని గ్రామస్తులకు మాజీ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, బెళుగుప్ప, ఆవులెన్న సహకార సంఘ అధ్యక్షులు శివలింగప్ప, శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాస్, జెడ్పీటీసీ మమత, అంకంపల్లి సర్పంచ్ రుద్రానంద, గంగవరం ఎంపీటీసీ ప్రసాద్, తహసీల్దార్ ఓబుళేసు, ఎంపీడీఓ రామచంద్ర, ఎంఈఓలు మల్లారెడ్డి, హరికృష్ణ, ఏఓ పృథ్వీసాగర్, నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కళాకారులను గుర్తింపునిచ్చింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే

కళాకారులను గుర్తింపునిచ్చి, తోడ్పాటు అందిస్తున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. జీడిపల్లి అంబేడ్కర్ కాలనీలోని హరిజన గంగాధర్ చూపు లేకున్నా కళలపై అభిమానంతో ఉత్తమ హార్మోనిస్టుగా పలు నాటకాల్లో పేరుతెచ్చుకున్నాడు. నాటకాలతో ప్రజా చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్న గంగాధర్‌ను జీడిపల్లి, కాలువపల్లి గ్రామాలకు చెందిన కళాకారులతో కలసి మాజీ ఎమ్మెల్యే సన్మానించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో ప్రజలకు భరోసా

కణేకల్లు: 'జగనన్న ఆరోగ్య సురక్ష' ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించనుందని యర్రగుంట పీహెచ్‌సీ డాక్టర్ విజయ్‌కుమార్ నాయక్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష'పై సమావేశం నిర్వహించారు. గరుడచేడు డాక్టర్ చంద్ర మనోహర్, ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు, ఈఓఆర్‌డీ గూడెన్న, ఎంఈఓ లక్ష్మణ్ణ హాజరయ్యారు. వైద్యుడు మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ప్రతి ఇంటికీ వెళ్లి వివిధ రుగ్మతలతో బాధపడుతున్న వారిని గుర్తించాలన్నారు. ఈ నెలాఖరు నుంచి వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు వైద్యసేవలందిస్తామన్నారు వలంటీర్లతో కలిసి ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు సర్వే చేయాలన్నారు. ఎంపీహెచ్ఈఓలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఘనంగా అక్షరాస్యత దినోత్సవం



ఉరవకొండ: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ/బ్రహ్మసముద్రం/రాయదుర్గం రూరల్/బొమ్మనహాల్: ఉరవకొండలోని ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ర్యాలీలో బడిఈడు పిల్లలను బడిలో చేర్చాలని, ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు అనే నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శిస్తు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్‌డీటీ ఫీల్డ్ ఆఫీసు ఆవరణలో జరిగిన సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప, ప్రభుత్వ ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ మమత, ఆర్డీటీ సీఓలు పాల్గొన్నారు. బ్రహ్మసముద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంలో ఎంఈఓ క్రిష్టానాయక్, ప్రధానోపాధ్యాయుడు చంద్రమౌళి, ఆర్డీటీ సీఓ రామక్రిష్ణ, మలోబన్న, ఆర్డీటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే రాయదుర్గం మండలంలోని 74 ఉడేగోళం ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో ఏటీఎల్ పుల్లారెడ్డి అధ్యక్షతన అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఎంఈఓ నాగమణి, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు. బొమ్మనహాళ్‌లో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంపై విద్యార్థులతో కలసి ఆర్డీటీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ మల్లికార్జున, ప్రధానోపాధ్యాయులు రాజ్‌కుమార్, సీఆర్‌పీలు, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు. బెళుగుప్ప మండల కేంద్రంలోని వెంకటేశ్వర కల్యాణ మంటపంలో నిర్వహించిన అక్షరాస్యత దినోత్సవంలో ఆత్మకూరు ఏరియా రీజనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి , పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రియాంక, ఏటీఎల్ సురేంద్ర, సీఓలు దుర్గాప్రసాద్, చెన్నరాయుడు, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పర్యవేక్షణ

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల, నిజవళ్లి పంచాయతీల్లో ఆర్డీటీ ఎకాలజీ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను శుక్రవారం స్పెయిన్ బృందం సభ్యులు పరిశీలించారు. రూ.12కోట్లతో ఆయా పంచాయితీల్లో పండ్లతోటల పెంపకం, పాడిపరిశ్రమ, భూ అభివృద్ధి, నీటి కుంటలు, చెక్‌డ్యాంల తవ్వకాలు తదితర అభివృద్ధి పనులను చేపట్టారు. స్పెయిన్ బృందం పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు సంస్థ ఎస్టీఓలు రామాంజనేయులు, వెంకటేశులు తెలిపారు. వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, సర్పంచ్ గంగాధర, జెడ్పీ మాజీ సభ్యుడు ఈరన్న, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా స్కూల్ గేమ్స్ ప్రారంభం

కంబదూరు: క్రీడలు మానసిక ప్రశాంతత కలగడంతో పాటు శారీరక దృఢత్వాన్ని ఇస్తాయని జెడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ల నాగరాజు, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభించారు.అండర్–14–17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, బాల్ బాడ్మింటన్, షటిల్, త్రోబాల్, యోగా, అథ్లెటిక్స్ తదితర పోటీలను నిర్వహించి, ప్రతిభ కనబరచిన విద్యార్థులను తాలూకా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఎంపీటీసీ మీసేవ కుమార్, నాయకులు విల్సన్, రాజు, శ్రీకాంత్, ఉపాధ్యాయుడు రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: స్థానిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి అండర్–14 అండర్–17 క్రీడా పోటీలు(అథ్లెటిక్స్)పోటీలను ఉపాధ్యాయులు పాఠశాల కమిటీ సభ్యులు ప్రారంభించారు. హెచ్ఎం కృష్ణప్ప, పీఈటీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి స్కూల్ గేమ్స్

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ జెడ్పీ హైస్కూల్లో ఈనెల 12, 13 తేదీల్లో స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు ఎంఈఓ మల్లికార్జున తెలిపారు. 2023–24 స్కూల్ గేమ్స్ నిర్వహణపై పీడీ, పీఈటీలతో శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ అండర్–14, అండర్–17 బాలురు, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బాడ్మింటన్, షటిల్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్‌లో పాల్గొనేందుకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు మండల కో ఆర్డినేటర్ హలీమా (9490640187)ను సంప్రదించాలన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని నేత్రపల్లి ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 12న మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్, హెచ్ఎం ఆదిశంకర్, పీడీ నాగేంద్ర తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు పాఠశాలలో పేర్లు నమోదు చేసుకోవాలని వారు కోరారు. ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గ స్థాయికి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

బరి తెగించిన తెలుగు తమ్ముళ్లు!



దౌర్జన్యం చేస్తున్న టీడీపీ నాయకులు

కళ్యాణదుర్గం: పట్టణంలో శుక్రవారం సాయంత్రం తెలుగు తమ్ముళ్లు బరి తెగించారు. ఇటీవల కళ్యాణదుర్గం పర్యటనలో మంత్రి కేవీ ఉషశ్రీచరణ్‌పై మాజీ సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ.. వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టణంలోని టీ సర్కిల్‌లో చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం చేసేందుకు సిద్ధమయ్యారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, నాయకులు భట్టువానిపల్లి ఆంజనేయులు, సుధీర్, తిరుమల వెంకటేశులు, అఫ్జల్, మల్లి, నాగరాజు, షేక్షావలి, రాము, రామాంజి, హరినాథ్‌రెడ్డి, బిక్కిహరి, లక్ష్మన్న, కిరీటి యాదవ్ తదితరులు దిష్టిబొమ్మ దహనం చేస్తుండగా టీడీపీ ఇన్‌చార్జ్ మాదినేని ఉమామహేశ్వరనాయుడు, అతడి అనుచరులు టీ సర్కిల్‌కు చేరుకుని కాలుతున్న దిష్టిబొమ్మను లాగేసేందుకు యత్నించారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ శ్రేణుల మధ్య తోపులాట జరిగింది. వాగ్వాదం చేసుకుంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేసుకున్నారు. టీడీపీకి చెందిన ఉమా వర్గీయులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు.అయితే టీడీపీ ఇన్‌ఛార్జ్ ఉమా వర్గీయులు పోలీసులను సైతం లెక్క చేయకుండా పోలీసులను తోస్తూ ముందుకు వెళ్లేందుకు యత్నించారు. తమను అసభ్యంగా మాట్లాడుతూ ఉమా వ్యవహరించిన తీరుపై పోలీసులు మండిపడ్డారు. పరిస్థితి శృతి మించడంతో డీఎస్పీ శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఇరు వర్గాలను చెదరగొట్టారు. కవ్వింపు చర్యలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించమని హెచ్చరించారు.

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందజేయాలి



మాట్లాడుతున్న జిల్లా చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి

ఉరవకొండ /విడపనకల్లు/బొమ్మనహాళ్: ఆర్‌బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా వ్యవసాయ శాఖ అధికారులు కృషి చేయాలని జిల్లా అగ్రి అడ్వజరీ బోర్డు చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం వజ్రకరూరు ఆర్‌బీకేలో మండల అగ్రి అడ్వైజరీ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా ఎరువులు, విత్తనాలు అందిస్తోందని, త్వరలోనే పురుగుల మందు కూడా అందుబాటులో తెస్తుందన్నారు. ఏడీఏ పద్మజ మాట్లాడుతూ ఈ నెల 15లోగా ఈ క్రాప్ బుకింగ్ ఆర్‌బీకే సిబ్బంది పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నెట్టికంఠయ్య, వెటర్నరీ డాక్టర్ కృష్ణమూర్తి, విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్, ఏఎస్ఓ సుభాషిణి పాల్గొన్నారు.అలాగే కూడేరులో మండల కేంద్రంలోని ఆర్‌బీకేలో మండల అగ్రి అడ్వైజరీ సమావేశం మండల చైర్‌పర్సన్ మేరీ నిర్మలమ్మ అధ్యక్షతన నిర్వహించారు. అలాగే విడపనకల్లులో నిర్వహించిన అగ్రి బోర్డు సమావేశంలో ఏఓ పెన్నయ్య, వెటర్నరీ వైద్యుడు నరేష్‌కుమార్, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు సుంకన్న, పీసీ కమిటీ చైర్మన్ గిరిబాబు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు. బొమ్మనహాళ్ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన అగ్రి బోర్డు సమావేశంలో ఏఓ సాయికుమార్, తహసీల్దార్ శ్రీనివాసులు, పశువైద్యాధికారి వెంకట్‌రెడ్డి, ఏపీపీ చైర్మన్ లింగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, జి.ఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం..ప్రాణాల మీదకు..!



వినాయక సర్కిల్‌లో ఓ భారీ ట్రక్ ఇరుక్కుపోవడంతో వాహనదారులు, ప్రజల అవస్థలు

రాయదుర్గంటౌన్: పోలీసులు, ఆర్టీసీ అధికారుల ఉదాసీనత, నిర్లక్ష్యం కారణంగా పట్టణంలోని వినాయక సర్కిల్‌లో ప్రయాణం ప్రాణాలమీదకు వస్తోంది. పట్టణ నడిబొడ్డున ఉన్న వినాయక సర్కిల్ ఆర్టీసీ, ప్రైవేటు బస్సులతోపాటు భారీ వాహనాలకు టర్నింగ్ అడ్డాగా మారింది. దీంతో నిత్యం ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. పలు సందర్భాల్లో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. పలు మార్లు సాక్షి దినపత్రికలో కథనాలు ప్రచురించి పోలీసు అధికారులు, ఆర్టీసీ అధికారుల దృష్టికి తెచ్చి సమస్య తీవ్రతను గుర్తు చేస్తున్నా పెడచెవినపెడుతున్నారు. డ్రైవర్లు సర్కిల్‌లో ఇష్టానుసారంగా బస్సులు తిప్పుకుంటూ వాహనదారులు, పాదాచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. బళ్లారికి వెళ్లే ఆర్టీసీ సర్వీసులు, కర్ణాటక మొలకాల్మూరు వైపు వెళ్లే ప్రైవేటు, కర్ణాటక ఆర్టీసీ బస్సులు నిత్యం వినాయక సర్కిల్‌లోనే తిప్పుకుంటూ స్టాండ్‌లకు వెళుతుండడంతో పెద్ద సమస్యగా మారింది. బస్సులు టర్న్ చేసుకోకుండా నియంత్రించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్పతోపాటు కౌన్సిలర్లు ఆర్టీసీ డీఎంకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోని పరిస్థితి ఉంది. మరోవైపు ట్రాఫిక్ పోలీసులు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడంతో సమస్య మరింత అధికమవుతోంది.

భారీ ట్రక్‌తో బెంబేలెత్తిన వాహనదారులు

శుక్రవారం ఓ భారీస్థాయి టగేజీ ట్రక్ లారీ డ్రైవర్ వినాయక సర్కిల్‌లో టర్నింగ్ చేస్తూ దాదాపు అరగంట పాటు ట్రాఫిక్ తో వాహనదారులు, పాదాచారులను బెంబేలెత్తించాడు. తాగిన మైకంలో అనంతపురం వైపు నుంచి వస్తూ సడెన్‌గా వినాయక సర్కిల్‌లో టర్నింగ్ చేయడంతో ట్రక్ ఇరుకుపోయింది. ఇష్టానుసారంగా టర్న్ చేస్తుండడంతో వాహనదారులు భయపడిపోయారు. స్థానికులు స్పందించి డ్రైవర్‌ను కిందకు దింపి తాగిన మైకం దిగేలా నీరు పోసి మళ్లీ డ్రైవింగ్ చేయించడంతో తిప్పుకుని అనంతపురం రోడ్డు వైపు వెళ్ళాడు. ట్రాఫిక్ పోలీసులకు సమాచారం చేరవేసినా సకాలంలో వచ్చి సమస్యను పరిష్కరించలేదని వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

సంక్షిప్త సమాచారం

19లోగా రిజిస్ట్రేషన్ చేసుకోండి

ఉరవకొండ: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మిగిలిపోయిన సీట్లకు అర్హులైన విద్యార్థులు నాలుగో విడత కింద ఈనెల 19లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు ఉరవకొండలోని పాత గాంధీచౌక్ వద్ద ఉన్న ఐటీఐ కళాశాలలో ఈ నెల 20న వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న వారికి ఉరవకొండ కళాశాలలో 22న కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

బహ్మసముద్రం: మండలంలోని పాలవెంకటాపురం పంచాయతీ మామడూరు గ్రామంలో కొంతకాలంగా తాగు నీటి సమస్య ఉండేది. గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు సమస్యను మంత్రి ఉషశ్రీ చరణ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి మామడూరు, మామడూరు జగనన్న కాలనీల్లో రెండు బోర్లు వేయించగా సమృద్ధిగా నీళ్లు పడ్డాయి. శుక్రవారం బోర్లలో కొత్త మోటర్లు బిగించి, పైప్ లైన్లు ఏర్పాటు చేశారు. దాదాపు రూ.15 లక్షలు ఖర్చు చేసి ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి చేసిన మంత్రికి వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, అయ్యన్న, లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జామ మొక్కల పంపిణీ

గుమ్మఘట్ట: పర్యావరణ పరిరక్షణలో భాగంగా 500 జామ మొక్కలను పంపిణీ చేసినట్లు కల్కి మానవ సేవా సంస్థ సభ్యులు కొంతం వినోద్‌కుమార్, వగ్గా ఆంజనేయులు, శరత్, తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని కలుగోడు ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 500 జామ మొక్కలను పంపిణీ చేసి, సంరక్షించాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు సోమనాథ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

'రీ సర్వే' సద్వినియోగం చేసుకోండి

బ్రహ్మసముద్రం: రైతులు 'రీ సర్వే'ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బాలకిషన్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఎరడికెర గ్రామంలో జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకం కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ కృష్ణ, సచివాలయ సిబ్బంది సర్పంచ్ అంజినమ్మ , ఎల్లప్ప, మాజీ సర్పంచ్ తిప్పేస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కుందుర్పి: మండలంలో ఎస్కే చారిటబుల్ ట్రస్ట్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న విలువల బడుల్లో భాగంగా శుక్రవారం కరిగానిపల్లి గ్రామంలో కృష్ణాష్టమిని పురస్కరించుకుని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాధాస్వామి, ట్రస్టు నిర్వాహకుడు లెనిన్ బాబు, కోఆర్డినేటర్ బొమ్మలింగ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కళాశాలలో వైద్య శిబిరం

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థునులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జగన్నాథ్ సూచించారు. శుక్రవారం కళాశాలలో డాక్టర్ రిహ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, 175 మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్ టెస్ట్ చేశారు.అధ్యాపకులు జయలక్ష్మి, బాపూజీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశులు, సచివాలయ హెల్త్ సెక్రటరీ సుభాషిణి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలేని యువతపై సర్వే

గుమ్మఘట్ట: మండలంలోని 75వీరాపురం గ్రామంలో కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అధికారిక విద్య, సాధరణ ఉపాధి లేని యువతపై శుక్రవారం ఇంటింటా సర్వే నిర్వహించారు. జాతీయ సేవా విభాగం యూనిట్–3 ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ నేతృత్వంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి 15– 29 మధ్య వయస్సున్న వారిపై సర్వే చేపట్టారు.చదువు కొనసాగించకపోవడానికి కారణాలు, ఆర్థికపరమైన స్థితిగతులు, ఉపాధికల్పనపై వివరాలు సేకరించారు.